పోలింగ్ ప్రశాంతం

- ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రాలకు క్యూకట్టిన ఓటర్లు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- రాత్రి వరకు సాగిన పోలింగ్
- నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటల వరకు 63.14 శాతం పోలింగ్ నమోదు


కె.నాగలాపురంలో వృద్ధున్ని తీసుకొస్తున్న సహాయకుడు


గుడిపాడులో దివ్యాంగ మహిళను వీల్‌చైర్‌పై తీసుకొస్తూ..


కోడుమూరులో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


సిరా గుర్తు చూపుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్


చనుగొండ్లలో తొలిసారి ఓటు వేసిన యువత


పంచలింగాలలో బారులు తీరిన మహిళలు

కోడుమూరు: నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల పరిధిలోని 269 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి. ఉదయం 6 గంటలకే ఓటర్లు వివిధ పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఉదయం 7గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ కోడుమూరులోని 242, 243, 247 కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. సాయంత్రం 6 గంటల్లోపు క్యూలో ఉన్న వారు రాత్రి 8 గంటల వరకు వేచివుండి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ ఉదయం 7 గంటలకే పసుపుల గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సాయంత్రం 5 గంటలకు తన స్వగ్రామమైన లద్దగిరిలో ఓటు వేశారు. కోడుమూరు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో 1260 ఓట్లు ఉండగా, 1161 ఓట్లు (92శాతం) పోలయ్యాయి. నియోజకవర్గంలోనే అత్యధికంగా ఓట్లు పోలైన గ్రామంగా కృష్ణాపురం నిలిచింది. కోడుమూరు పట్టణంలో 20,990 మంది ఓటర్లు ఉండగా 14,560 మంది ఓటు వేశారు. సాయంత్రం 5 గంటల వరకు వచ్చిన సమాచారం మేరకు కోడుమూరు నియోజకవర్గంలో 2,46,616 ఓట్లు ఉండగా, 1,55,717 ఓట్లు(63.14) పోలయ్యాయి. ఇందులో 77,958 పురుష ఓటర్లు ఉండగా 77,756 మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ అధికారుల అవస్థలు

భారీ వర్షం కురవడంతో 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణాపురం వద్దనున్న వంక తెగిపోవడంతో ఎన్నికల అధికారులు పోలింగ్ ముగించుకుని రాత్రి 9:30 గంటల సమయంలో దేవనకొండ మండలంలోని కోటకొండ మీదుగా అదనంగా 30 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వచ్చింది.

గూడూరు రూరల్: మండల పరిధిలోని బూడిదపాడు, కె.నాగలాపురం, పెంచికలపాడు, గుడిపాడు, చనుగొండ్ల, ఆర్.ఖానాపురం, మునగాల, మల్లాపురం, జూలకల్, పొన్నకల్, వై.ఆనాపురం గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి. ఉదయం 6 గంటల నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన తాగునీరు, ఎండ నుంచి రక్షణగా షామియానాలను ఏర్పాటు చేశారు. చనుగొండ్లలో ఎంపీపీ సునీత, విజయప్రతాప్‌రెడ్డి దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి బూడిదపాడు, పెంచికలపాడు, గుడిపాడు గ్రామాల్లో పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఆయన వెంట బూడిదపాడు వైఎస్సార్‌సీపీ నాయకులు కొండారెడ్డి, సుబ్బన్న, వరశేఖర్, నాగరాజు, చికెన్ బాషా, మాబాషా, పెంచికలపాడు తదితరులు ఉన్నారు.


చనుగొండ్లలో ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీపీ సునీత


చనుగొండ్లలో బారులు తీరిన ఓటర్లు


పెంచికలపాడులో..




గూడూరు: ఓటరు స్లిప్‌లు చూసి లోనికి పంపుతున్న పోలీసులు, గూడూరు: వీల్‌చైర్‌పై వస్తున్న వృద్ధురాలు గూడూరు: సిరా గుర్తు చూపుతున్న వృద్ధురాలు

గూడూరులో పోటెత్తిన ఓటర్లు

గూడూరు: పట్టణంలో పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. ఉదయం వర్షాన్ని లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. చాలా పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ మొదలైంది. వృద్ధులు, దివ్యాంగులు ఉత్సాహంగా తరలిరావడం విశేషం.


బైన్‌దొడ్డి వద్ద పొంగిపొర్లుతున్న వంక

పుడమి పులకరించింది

కోడుమూరులో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెలవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. సుమారు 3గంటల పాటు ఏకధాటిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఒట్టిపోయిన హంద్రీనదితో పాటు, వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి.

–కోడుమూరు రూరల్

పాణ్యం మండలంలో 86.36 శాతం

పాణ్యం: మండలంలో 86.36 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ ఫణికుమార్ తెలిపారు. మొత్తం 18005 మంది పురుష ఓటర్లు ఉండగా 15872 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే స్త్రీలు 19171 మంది ఉండగా 16243 మంది ఓటు వేశారు.కాగా గోరుకల్లు గ్రామంలో రాత్రి 10:30 గంటల వరకు పోలింగ్ జరిగింది. గ్రామంలో మొత్తం 1195 మంది ఓటర్లు ఉండగా 1075 మంది(90శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్‌కేంద్రంలో టీడీపీ శ్రేణుల అలజడులు

కల్లూరు: పాణ్యం నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అయితే, కల్లూరు అర్బన్ 41వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీ పరిధిలోని బీసీ కాలనీలో ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రం దగ్గర టీడీపీ శ్రేణులు అలజడి సృష్టించడానికి ప్రయత్నించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నంద్యాల జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు పార్వతమ్మ తనయుడు శివ, నాయకులు అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. సాయంత్రం పోలింగ్ పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే తనయుడు కాటసాని శివనరసింహారెడ్డిని సైతం అలానే చేశారు. దీంతో ఇరువురి మధ్య అక్కడ కొద్దిపాటి వాగ్వాదం జరిగింది. ఓటమి భయంతోనే టీడీపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి.

దాడులకు దిగిన టీడీపీ

ఓర్వకల్లు: మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై భౌతిక దాడులకు పాల్పడ్డారు. పూడిచెర్ల, హుసేనాపురం, హెచ్.కొట్టాల, శకునాల, నన్నూరు గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై భౌతిక దాడులకు దిగారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు స్వల్పంగా గాయపడ్డారు. సీఐ కిరణ్‌కుమార్, ఎస్‌ఐ రాజారెడ్డి ఘటనా స్థలాలకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

వెల్లివిరిసిన ఓటు చైతన్యం


సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకుని వెలుపలకు వస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- పాణ్యం నియోజకవర్గంలో ఉదయం నుంచే కేంద్రాలకు పోటెత్తిన ఓటర్లు
- రాత్రి అయినా వేచి ఉండి ఓటు
- సాయంత్రం 6 గంటల వరకు 73 శాతం నమోదు


గోరుకల్లులో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


పాణ్యంలో ఉదయం 6.40గంటలకే..

పాణ్యం: నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు సోమవారం ఉదయం 6:30 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు క్యూకట్టారు. పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. పాణ్యంలోని 278 పోలింగ్ కేంద్రంలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. అలాగే బలపనూరు, గోరుకల్లు, కొణిదేడు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. టెక్నికల్ సిబ్బంది వాటిని సరిచేయడంతో పోలింగ్ కొనసాగింది. పాణ్యం నియోజకవర్గంలో 2019లో 74.41 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి సాయంత్రం 6 గంటలకు 73 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పలు చోట్ల ఇరుపార్టీ నాయకులు స్వల్ప ఘర్షణలకు దిగడంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్ది చెప్పారు. గోరుకల్లు గ్రామంలో మధ్యాహ్నం 4 గంటలకు సైతం కేవలం 41శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం ఒక్కసారిగా మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి 8 గంటల వరకు క్యూలో వేచివుండి ఓటు వేశారు.


పాణ్యంలో క్యూలో వేచివున్న ఓటర్లు

ఓటెత్తిన మహిళా చైతన్యం


కేతవరంలో తొలి ఓటు హక్కును వినియోగించుకున్న యువతి

ఓర్వకల్లు: మండలంలో యువత, మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉత్సాహం చూపారు. ఉదయం 6.50 గంటలకే ఆయా గ్రామాల పోలింగ్ కేంద్రాల వద్ద పోటెత్తారు. గుట్టపాడు, లొద్దిపల్లె, చింతలపల్లె తదితర గ్రామాల్లో సాంకేతిక సమస్యల కారణంగా ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. మండలంలో మొత్తం 48,604 మంది ఓటర్లు ఉండగా 85.04 శాతం ఓట్లు పోలైనట్లు మండల ఎన్నికల అధికారి నటరాజన్ తెలిపారు. కొమరోలు, ఉప్పలపాడు నన్నూరు, గుట్టపాడు గ్రామాల్లో ఓటర్లు రాత్రి అయినా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.


హుసేనాపురంలో ఓటు వేయడానికి వెళ్తున్న దివ్యాంగుడు

గడివేములలో పెరిగిన ఓటింగ్ శాతం


మంచాలకట్ట పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

గడివేముల: మండలంలో గత ఎన్నికలతో పోలిస్తే ఈ దఫా పోలింగ్ శాతం పెరిగింది. మండల పరిధిలోని 42 పోలింగ్ కేంద్రాల్లో 34,635 మంది ఓటర్లు ఉన్నారు. 30362 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 87.66 శాతం నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు మంచినీరు, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గడివేములతో పాటు పెసరవాయి పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకుడు పంఖజ్ కుమార్ పరిశీలించారు. 308 మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా ఏర్పాటు చేసిన బీఎల్‌ఓ మల్లికను అభినందించారు. తన మొబైల్‌లో ఫొటో తీసుకున్నాడు. పోలింగ్ సరళిని తహసీల్దార్ జమానుల్లాఖాన్, ఎంపీడీఓ శివరామిరెడ్డి పర్యవేక్షించారు. సాయంత్రం వర్షం కురవడంతో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మండలంలో పెసరవాయి, మంచాలకట్ట, చిందుకూరు గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు ఇతర చోట్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య శాంతిభద్రతలను పర్యవేక్షించారు.


పెసరవాయి గ్రామంలో క్యూలో ఉన్న ఓటర్లు

క్లుప్తంగా

మళ్లీ వైఎస్సార్‌సీపీదే అధికారం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారని, రాష్ట్రానికి మరోసారి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే కాటసాని తన ఓటును కల్లూరు అర్బన్ 33వ వార్డులోని పోలింగ్ కేంద్రంలో వినియోగించుకున్నారు. అనంతరం ఆయన కల్లూరు అర్బన్‌లోని ముజఫర్‌నగర్, వీకర్ సెక్షన్ కాలనీ, 20 వార్డులోని సెయింట్ జోసఫ్ పాఠశాల, లక్ష్మీపురం, పందిపాడు, కృష్ణానగర్, డాక్టర్స్ కాలనీ, శరీన్‌నగర్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమానికి ప్రజలు ఓటేశారన్నారు. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారన్నారు. రాష్ట్రంలోని పేద,బడుగు,బలహీనవర్గాలతో పాటు మహిళలు, వృద్ధులు వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. పాణ్యంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.

సి.బెళగల్‌లో రాత్రి వరకు పోలింగ్


సి.బెళగల్: కె.సింగవరంలో..


సి.బెళగల్: ఈర్లదిన్నెలో వృద్ధురాలిని తీసుకొస్తున్న సహాయకులు


వృద్ధుడిని పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తూ..

సి.బెళగల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. మారందొడ్డి గ్రామంలోని 187 పోలింగ్ కేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఉదయం 9 గంటల వరకు పోలింగ్ ప్రారంభం కాలేదు. ముడుమాల గ్రామంలోని 13వ పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్నం అనంతరం తలెత్తిన సమస్యతో రాత్రి 8:45 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగింది. అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి సమస్యను పరిష్కరించారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి యువకులు ఉత్సాహంగా తరలివచ్చారు. మండలంలోని పోలింగ్ సరళిని కోడుమూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పరిశీలించారు.

గాయపడిన ఏపీఓ

మండల కేంద్రం సి.బెళగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో విధులకు వచ్చిన మహిళా ఉద్యోగిని (ఏపీఓ) విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో చీకట్లో అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు. ఎన్నికల అధికారులు, బీఎల్వోలు ప్రథమ చికిత్స చేయించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఇంటికి పంపారు.


సి.బెళగల్‌లో..


తిమ్మందొడ్డిలో రాత్రి 8:20 గంటలకు..

డ్రిప్ సామగ్రికి నిప్పు

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పొలంలో ఉన్న డ్రిప్ పైపులకు నిప్పు పెట్టారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ తలారి కృష్ణయ్య సోదరుడు తలారి రాముడుకు చెందిన 5 ఎకరాల్లో ఉపయోగించే డ్రిప్పు పైపులను చుట్టి పొలంలోనే ఒకచోట ఉంచారు. అక్కడే ఆరు క్వింటాళ్ల పత్తి సైతం ఉంచారు. రోజు మాదిరిగానే ఉదయం పొలానికి వెళ్లి చూడగా పత్తిలో నుంచి పొగ రావడం గమనించి పరిశీలించగా అప్పటికే డ్రిప్ పైపులు, పత్తి కాలిపోయాయి. తెల్లవారుజామున వర్షం పడడంతో పక్కనే ఉన్న మేత వాములకు ప్రమాదం తప్పినట్లు గుర్తించాడు. రూ.70వేల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

సి.బెళగల్‌లో వర్ష బీభత్సం

- 70.6 మి.మీ వర్షపాతం నమోదు


నెలకొరిగిన చెట్టు


మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద కుప్పకూలిన షామియానా, స్వాగత బ్యానర్లు


భారీ వర్షానికి కంబదహాల్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

సి.బెళగల్: మండలంలో వర్షం బీభత్సం సృష్టించింది. సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు మోస్తరుగా మొదలై క్రమంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం 6 గంటల వరకు వర్షం కురవడంతో 70.6 మి.మీ వర్షపాతం నమోదైంది. కంబదహాల్ రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులకు సి.బెళగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన షామియానా, స్వాగత బ్యానర్లు కుప్పకూలాయి. కొన్ని గ్రామాల్లో చెట్లు విరిగి రోడ్లపై పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షంతో కొంత ఉపశమనం పొందారు.